సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



ఘట్‌కేసర్: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన మున్సిపాలిటీకి చెందిన నాగభూషణంకు మంజూరైన రూ. 60 వేల చెక్కును కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్‌తో కలిసి మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

చేను కాదిది...చెరువు!



చెరువు నీటిపై అలుముకున్న గుర్రపుడెక్క

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుతారిగూడ గ్రామ పరిధిలో మేడ్చల్ చెక్‌పోస్ట్–గండిమైసమ్మ ప్రధాన రహదారి పక్కనే ఉన్న సుతారిగూడ ప్రధాన చెరువు చేనును తలపిస్తోంది. గత కొన్నేళ్లుగా చెరువులో గుర్రపు డెక్క నీటిని కప్పేస్తుంది. పలుమార్లు మత్స్యకారులు దీనిని తొలగించినా సమస్య తొలగడం లేదు. తాజాగా చెరువు నీటిపై 80 శాతం మేర గుర్రపుడెక్క పచ్చగా అలుముకుని నీరు కనిపించకుండా పోయింది. దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్వెల్లిగూడలో రెవెన్యూ అధికారుల సర్వే



సర్వేపై గ్రామస్తులతో చర్చిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడలో వివాదాస్పద స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సర్వే కోసం ముత్వెల్లిగూడకు చెందిన నర్సింగరావు, శ్రీశైలం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోగా.. ఘట్‌కేసర్ మండల సర్వేయర్ వినయ్ ఆధ్వర్యంలో సర్వే జరిగింది. దీంతో సర్వే నెంబర్లు 1, 82, 83 మధ్య ఏర్పడిన స్థల వివాదానికి తెరపడింది. సర్వే నెంబర్లు 82, 83కు హద్దులు నిర్ధారించి, వివాదాస్పద స్థలం వద్ద రెడ్ మార్కుతో గుర్తులు పెట్టి సమస్యను పరిష్కరించారు. గతంలో కొన్ని కారణాల వల్ల సర్వే వాయిదా పడినప్పటికీ అందరి సహకారంతో మంగళవారం సర్వే సజావుగా సాగింది. భూయజమానులు కేశవ్‌రెడ్డి, సుఖేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఆయా ప్రాంతవాసులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, విద్యామారుతీకాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, వీఆర్‌నగర్ కాలనీల్లోని పార్కులను ఆమె పరిశీలించారు. పార్కుల్లో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన వసతులు, అభివృద్ధిపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఆహ్లాదాన్ని పంచే పార్కుల్లో పచ్చదనం నింపే దిశగా కార్యచరణ చేయాలని సూచించారు. దశలవారీగా అన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. యూబీడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లోకేష్‌కుమార్, నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

తెలంగాణ మెడికల్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు



మల్లాపూర్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నేతలు మాట్లాడుతూ.. యూనియన్ వైద్యరంగంలోని ఉద్యోగుల కోసం పోరాటాలు చేస్తుందన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాచారం ఈఎస్ఐ బ్రాంచ్ సెక్రటరీ వేణుకుమార్, భాగ్యలక్ష్మి, రాజామణి, ధన్‌రామ్, భాగ్య, సౌందర్య, జామియాకుమార్, రాఘవేందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

‘బడిబాట’కు ఆదరణ భళా!

- ప్రభుత్వ స్కూళ్లల్లో 10 రోజుల్లో 2,079 మంది విద్యార్థుల చేరిక
- ప్రైవేట్‌లో ఫీజుల మోతతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- టీచర్లు ఇంటింటికి వెళ్లి వసతుల కల్పనపై అవగాహన



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచే లక్ష్యంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ 'బడి బాట' కార్యక్రమం చేపడుతోంది. బడిబాటలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, ఉచితంగా అందజేస్తున్న అంశాలపై విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 6 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన 'బడిబాట'లో 2,079 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. – ఒకటో తరగతిలో 1,045 మంది చేరగా.. 6వ తరగతిలో 380 మంది, 8వ తరగతిలో 78 విద్యార్థులు, మిగతా తరగతుల్లో 548 మంది విద్యార్థులు చేరారు. 'బడి బాట' కార్యక్రమం గురువారం వరకు కొనసాగనుంది.

అధిక ఫీజులతో ఇబ్బంది..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి ఏడాది పెంచుతున్న అధిక ఫీజులను చాలామంది తల్లిదండ్రులు చెల్లించలేని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ..

కరోనా నుంచి మొదలుకుని, ప్రైవేట్, కార్పొరేట్‌ల్లో ఫీజులు, పుస్తకాల మోతతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావటంతో ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. పైగా ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లేలా చేస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఆదరణ లభిస్తోంది.

'బడిబాట'కు స్పందన ఇలా...

మేడ్చల్–మల్కాజిగిరిలో 'బడి బాట' కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. జిల్లాలో 2021 నుంచి 2025 విద్యా సంవత్సరంలో 15,804 మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లల్లో చేరారు. 2021–22 విద్యాసంవత్సరం (కరోనా సమయం)లో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718మంది విద్యార్థులు చేరగా.. ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు.

- 2022–23 జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా.. ఇందులో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో 1,976 మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లల్లో చేరారు. ఇందులో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 1,194 కాగా.. రెండో తరగతి నుంచి పదోతరగతిలో చేరిన విద్యార్థులు 782 మంది ఉన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 2,123 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు.

ప్రభుత్వ స్కూళ్లల్లో చేరిన విద్యార్థుల సంఖ్య ఇలా ఉంది

మండలం	విద్యార్థులు	మండలం	విద్యార్థులు
అల్వాల్	132	కూకట్‌పల్లి	98
బాచుపల్లి	140	మల్కాజిగిరి	153
బాలానగర్	168	మేడ్చల్	250
దుండిగల్	19	మేడిపల్లి	237
ఘట్కేసర్	193	ఎంసీపల్లి	61
కాప్రా	99	కుత్బుల్లాపూర్	202
కీసర	56	శామీర్‌పేట	118
		ఉప్పల్	153

ప్రైవేటుకు దీటుగా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగినట్లుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారు. 'మనబడి –మన ఊరు–మన బస్తీ' కార్యక్రమం కింద తొలి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలు తీసుకున్నారు. 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు చేపడుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలను 'బడిబాట'లో జిల్లా విద్యాశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఫలితంగా బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది.

బడ్జెట్ పాఠశాలలకు సహకరించండి

డీఈఓకు ట్రస్మా వినతి



డీఈఓ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న ట్రస్మా సభ్యులు

సాక్షి,సిటీబ్యూరో: బడ్జెట్ స్కూళ్ల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల యాజమాన్యాలకు సహకరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారిణిని ట్రస్మా నేతలు కోరారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లా ట్రస్మా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబులు ఈ సందర్భంగా డీఈఓను సత్కరించారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో బడ్జెట్ పాఠశాలను ఇబ్బందులకు గురిచేసేలా ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రస్మా జిల్లా నాయకులు గడ్డమీది బాలరాజు, వినోద్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధి గ్రస్తుల గుర్తింపు శిబిరం

కాప్రా: కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మంగళవారం అయోధ్యనగర్ పల్లె దవాఖానాలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి చేతుల మీదుగా ప్రారంభించారు. బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి తెలిపారు. నిర్ధారణ అయితే మందులు కుషాయిగూడ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డాక్టర్ విజయరాణి, బీజేపీ నేతలు మహేందర్‌రెడ్డి, పల్లె దవాఖానా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హనుమనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వాసవనగర్ ప్రాంతానికి చెందిన దుస్స నవీన్‌కుమార్ (24) గత కొన్నాళ్లుగా ఆనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుమారుడి కోసం తల్లి ఓ కిడ్నీ సైతం దానం చేసింది. అయినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో విరక్తి చెంది ఇంట్లో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

భారమైనా.. సంక్షేమ పథకాలు అమలు చేస్తాం



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తదితరులు

- చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి
- 805 మంది లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..
- రూ.8.05 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు ప్రభుత్వానికి పెను భారమైనప్పటికీ పేదల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రగతి కోసం వాటిని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలంలోని ఎస్ఎస్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికభారం ఉన్నా.. పేదల సంక్షేమం విడువమని, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా నెరవేరుస్తామని మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు హాజరుకావడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు.

- మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 805 మంది లబ్ధిదారులకు రూ. 8.05 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. మేడ్చల్ మండలంలోని 139 లబ్ధిదారులకు రూ.1.39 కోట్లు, శామీర్‌పేట్ మండలంలోని 71 మంది లబ్ధిదారులకు రూ.71.08 లక్షలు.
- మూడుచింతలపల్లి మండలంలోని 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షలు, కీసర మండలంలోని 136 మంది లబ్ధిదారులకు రూ.1.36 కోట్లు, కాప్రా మండలంలోని 81 మంది లబ్ధిదారులకు రూ.81.09 లక్షలు, ఘట్‌కేసర్ మండలంలోని 131 మంది లబ్ధిదారులకు రూ.1.31 కోట్లు, మేడిపల్లి మండలంలోని 220 మంది లబ్ధిదారులకు రూ.2.20 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు తోటకూర వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, బీజేపీ నేతలు విక్రమ్‌రెడ్డి, తహసీల్దార్లు యాదగిరిరెడ్డి, రజిని, అశోక్, నర్సింహారెడ్డి, సుచరిత, హసీనా పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాకారులు ప్రభుత్వ పథకాలపై పాడిన పాటలు ఆహుతులను అలరించాయి.

శ్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హిందూ శ్మశానవాటిక సమస్యపై కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అభ్యర్థన మేరకు మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ పలువురు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని, కొత్త బోర్‌వెల్ నిర్మాణం, బాత్‌రూమ్‌ల పునర్నిర్మాణం, దహన సంస్కారాల వేదికల పునర్నిర్మాణం, ఫ్లోరింగ్, పచ్చదనం అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం సమస్యలపై స్థానికవాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ఎంపీ ఈటల రాజేందర్



బాక్స్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరించేందుకు బాక్స్ డ్రైనేజీ పనులను చేపట్టామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలో బాక్స్ డ్రైనేజీ పనులను నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో మురుగు, వరదనీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుందన్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దమ్మాయిగూడ పెద్ద చెరువు నుంచి చర్లపల్లి చెరువు వరకు మురుగునీరు సాఫీగా దిగువ ప్రాంతానికి వెళ్లేలా బాక్స్ డ్రైనేజీ పనులను చేపడతామన్నారు. తొలి విడతలో చర్లపల్లి నుంచి మోదీ బిల్డర్స్ వరకు గతంలో చేపట్టిన బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, రెండో విడత బాక్స్ డ్రైనేజీ పనుల కోసం హెచ్ఎండీఏ రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ నిధులతో పనులు చేపడతామని స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, సురేష్, కిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణపై అవగాహన



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్: మున్సిపాలిటీల్లో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా 12వ వార్డులోని ఆర్టీసీ కాలనీలో చెత్త సేకరణపై మున్సిపల్ అధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసులతో సమావేశం నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వచ్ఛ వాహనాల్లో వేయాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత, రోడ్లపై గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చేయడం, వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సోకే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉందని, ప్లాస్టిక్ అమ్మినా, వాడినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. 100 రోజుల ప్రణాళిక గురించి వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రియాంక మధుకర్‌యాదవ్, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఈటీ వ్యాక్సిన్ తప్పక వేయించాలి



రావల్‌కోల్‌లో గొర్రెలకు ఈటీ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

మేడ్చల్: గొర్రెల పెంపకందారులు తమ గొర్రెలకు ఈ సీజన్‌లో తప్పకుండా ఈటి వ్యాక్సిన్‌లు ఇప్పించాలని పశువైద్యాధికారి డాక్టర్ కురుమూర్తి అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్‌లో ఆయన గొర్రెలకు ఈటీ వ్యాక్సిన్‌లు వేసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సీజన్‌లో కొత్తగా వచ్చే పచ్చగడ్డి, ఆరిపోయిన గడ్డిని గొర్రెలు తినడం వల్ల రోగాలు సోకి అవి మరణించే ప్రమాదం ఉందని ముందుగా వ్యాక్సిన్ వేస్తే గొర్రెల మృత్యువాతను అరికట్టవచ్చన్నారు. అన్ని గ్రామాల్లో వైద్యులు వ్యాక్సిన్ వేస్తారని, గొర్రెల పెంపకందారులు తమ గొర్రెలకు వ్యాక్సినైజేషన్ చేయించాలని కోరారు. పశువైద్య సిబ్బంది డాక్టర్ శోభారాణి, శ్రీనివాస్, గణేష్, జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి.. మరిచారు!



మాట్లాడుతున్న యాదగిరియాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వంతెన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యేను అడిగితే కాంగ్రెస్ వాళ్లను అడగాలని అనడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో చేపట్టిన నిరాహార దీక్ష ముగింపు సమయంలో వంతెనను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. పనులు ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని, తిరిగి టెండర్లు వేయకుండా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్‌ను రద్దు చేసి తిరిగి టెండర్‌కు పిలవాలన్నారు. వంతెన పనుల కారణంగా జిల్లాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావడం లేదని, దీంతో వృద్ధులు, చిన్నారులు, లగేజీతో మహిళలు బైపాస్ రోడ్డు వరకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఔటర్ వద్ద అదుపు తప్పిన లారీ



కీసర: ఔటర్ రింగురోడ్డు వద్ద లారీ అదుపు తప్పిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ కీసర నుంచి నాగారం వెళ్తున్న క్రమంలో కీసర ఔటర్ రింగురోడ్డు వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా ఉన్నాడని, ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వాహనాలు నిదానంగా వెళ్లేలా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తార స్థాయిలో అక్రమ నిర్మాణాలు!

- కబ్జాకోరల్లో రహదారులు, పార్కులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు తారస్థాయికి చేరుకున్నాయి. పలు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తినా అధికారులు స్పందించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులతో పాటు హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అనేక మంది నిబంధనలను తుంగలోతొక్కి అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టినా అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అన్నోజిగూడలో ఎకరం పార్కు కబ్జా...

అన్నోజిగూడలోని సర్వే నెంబర్లు 9, 10లోని పదెకరాల లేఅవుట్‌లో ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కును ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినా ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ సమస్యను హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కనుమరుగైన రెండెకరాల ప్రభుత్వ భూమి..

అన్నోజిగూడలోని సర్వే నెంబర్ 14లో రెండెకరాలకు పైగా ఉండాల్సిన ప్రభుత్వ భూమి కనుమరుగైంది. ఇప్పటికే ఈ భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి విక్రయించారు. రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి మౌనం పాటిస్తున్నారని వినికిడి.

జోడిమెట్లలో భారీ షెడ్డు..

జోడిమెట్లలోని జాతీయ రహదారి పక్కనే కొన్ని ఎకరాల విస్తీర్ణంలో భారీ షెడ్డు నిర్మిస్తున్నారు. అధికారులకు కోటి రూపాయలు ముట్టజెప్పినట్లు సమాచారం. దీనిపై సంబంధిత హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులను అడిగితే తమకేమీ తెలియడం లేదని దాటేస్తున్నారని పలువురు చెబుతున్నారు.

ఒకే చోట 3 భవనాలు..

చౌదరిగూడలోని విజయపురికాలనీలో ఒకే చోట 3 భవనాలను అనుమతులకు మించి అదనపు అంతస్తులతో చేపట్టిన నిర్మాణాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనాలు తుది దశలో ఉన్నాయి. రోజూ మున్సిపల్ సిబ్బంది అటువైపుగా వెళ్తానే ఉంటారు.

చౌదరిగూడలో 5 భవనాలు..

చౌదరిగూడలోని నేచర్ క్యూర్ ఆసుపత్రి సమీపంలో టైల్స్ ల్యాబ్ పక్కన, సురభి హోటల్ వెనక అదనపు అంతస్తులతో భారీ భవనాలు నిర్మిస్తున్నారు. ఈ 3 భవనాల అదనపు అంతస్తుల స్లాబ్‌లు వేయకుండా మున్సిపల్ అధికారులు వారం రోజులు నిలిపేశారు. వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద సర్వే నెంబర్ 867/2లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రెండు భవనాలు నిర్మిస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరి చూపిస్తున్నారు.

ముత్వెల్లిగూడలో రోడ్డును ఆక్రమించి..

ముత్వెల్లిగూడలో రహదారిని 9 అడుగులు ఆక్రమించి సెల్లార్‌తో పాటు భవన నిర్మాణం జరుగుతోందని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలున్నాయి. అదే ప్రాంతంలో మర 4 భవనాలు తూర్పు వైపున 10 అడుగుల వరకు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.